TGTEL/26/A2635

DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 43 | 25-06-2026 గురువారం | పేజీలు: 08 | వెల: 3/- |
|---|---|---|---|---|---|




## డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



03

## హైదరాబాద్ వాసులకు తాగునీటి ముప్పు..!

**డెడ్ స్టోరేజ్‌కు చేరిన సింగూరు ప్రాజెక్టు**

**జూలై చివరి వరకే నీటి సరఫరా..?**

**17 మోటార్లతో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు**

**మిషన్ భగీరథ అధికారులు యుద్ధ ప్రాతిపదిక చర్యలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు తాగునీటిని అందించే కీలకమైన సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 'డెడ్ స్టోరేజ్' (మృత నిల్వ) స్థాయికి నీటి మట్టం చేరుకోవడంతో రాబోయే మిగతా 2లో..



## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..



**ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక**

**నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం**

**పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా**

**గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన**

**పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై మిగతా 2లో..

# రేవంత్ ఢిల్లీ చుట్టూ తిరిగితే లాభమేంటి?

**సత్తుపల్లి వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తెలంగాణ మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి ప్రజల ఆశలు నెరవేర్చే స్థిరమైన ముఖ్యమంత్రి కాదని, "రెన్యువల్ సీఎం"గా మారారని వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పుతో వచ్చిన ప్రభుత్వాలు తమ పనితీరుతో నిలబడాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు మిగతా 2లో..

**రేవంత్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు**

**కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారన్న కేటీఆర్**

**ఢిల్లీ చుట్టూ తిరిగితే ఫలితం ఏంటి?**

**రైతులు, నిరుద్యోగులు నిరాశలోనే**

**అన్ని వర్గాలను వేధిస్తున్న ప్రభుత్వం**

**జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణ**

**స్థానిక ఎన్నికల ఫలితాల ప్రస్తావన**

**శ్రేణులకు ధైర్యం చెప్పిన కేటీఆర్**

**బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా**

## ముంబైని ముంచెత్తిన వాన

**దేశ ఆర్థిక రాజధానిలో**

**థాణెలో భారీ వర్షాలు**

**పలు ప్రాంతాలు జలదిగ్బంధం**

**రహదారులపై నిలిచిపోయిన నీరు**

**మాల్షేజ్ ఘాట్‌లో స్తంభించిన ట్రాఫిక్**

**చెట్లు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు**

**విద్యాసంస్థలకు సెలవులు**

**పలు ప్రాంతాలకు రెడ్ అలర్ట్**

**అంధేరి అండర్‌పాస్ నీటమునక**

**విమాన సర్వీసులపై ప్రభావం**

**అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మహారాష్ట్రలో వర్షాలు తీవ్ర రూపం దాల్చాయి. ముఖ్యంగా రాజధాని ముంబయితో పాటు థాణె, పాల్ఘర్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల కారణంగా పలు ప్రాంతాలు నీట మునిగిపోగా, ప్రధాన రహదారులపై భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల ప్రభావం థాణెపుణె మధ్య కీలక రవాణా మార్గమైన మాల్షేజ్ ఘాట్‌పై కూడా పడింది. వర్షాల కారణంగా చెట్లు విరిగిపడటంతో పాటు మిగతా 2లో..

## తుంగభద్ర జలాలపై కుట్రలు ఆపాలి



**సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ లేఖ**

**కర్ణాటక ప్రాజెక్టులపై ఆందోళన**

**తెలంగాణ హక్కులు కాపాడాలని డిమాండ్**

**ఆర్డీఎస్‌కు ముప్పు ఉందన్న హరీశ్**

**కొడంగల్ లిఫ్ట్‌పై ప్రశ్నల వర్షం**

**కర్ణాటకతో లోపాయికారి ఒప్పందాలా?**

**సుప్రీంకోర్టుకు వెళ్లాలని సూచన**

**పాలమూరు రైతుల భవిష్యత్తుపై హెచ్చరిక**

**జల హక్కులను తాకట్టు పెట్టొద్దు**

**పోరాటం కొనసాగిస్తామని స్పష్టం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకుని తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖను బుధవారం విడుదల చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కృష్ణా, గోదావరి జలాల విషయంలో జరిగిన అన్యాయాలపై ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేసిందని మిగతా 2లో..

## గురుకుల విద్యలో రేవంత్ సర్కార్ సంచలనం

**133 గురుకులాలకు శాశ్వత సొంత భవనాల నిర్మాణం**

**అణగారిన వర్గాలకు ప్రపంచ స్థాయి చదువులు..**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు, సరికొత్త 'ఫోన్ మిత్ర'**

**విద్యా రంగమే సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధం**

**డిగ్రీ అధ్యాపకులకు యూజీసీ స్కేల్..**

**ప్రత్యేక అడ్మినిస్ట్రేటివ్ వింగ్ ఏర్పాటు**

**జాతీయ పోటీ పరీక్షల కోసం కొత్తగా 9 కేంద్రాలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మిగతా 2లో..

## హైడ్రా ఉక్కుపాదం.. కాపాడిన రూ.వెయ్యి కోట్ల భూమి

**ఖానామెట్‌లో ఆక్రమణల తొలగింపు**

**ఐటీ కారిడార్‌లో కీలక స్థలం**

**5 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ**

**అక్రమ నిర్మాణాల కూల్చివేత**

**ఫెన్సింగ్ వేసి స్వాధీనం**

**రెవెన్యూ ఫిర్యాదుతో చర్యలు**

**ఆక్రమణ యత్నాలకు అడ్డుకట్ట**

**ప్రభుత్వ భూమిగా బోర్డుల ఏర్పాటు**

**హైటెక్స్ మార్గంలో విలువైన స్థలం**

**ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మిగతా 2లో..

## కేసీఆర్ అప్పులు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలు అమలు

**బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ కుటుంబంపై భట్టి విమర్శలు**

**రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టి**

**సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు పిలుపు**

**వైరాలో రాజకీయ వేడి పెంచిన భట్టి వ్యాఖ్యలు**

**రైతు ఆశీర్వాద సభకు కాంగ్రెస్ నేతల కార్యాచరణ**

**వ్యవసాయ రంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: భట్టి**

**రైతు ఆశీర్వాద సభతో కాంగ్రెస్ శక్తి ప్రదర్శన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'రైతు ఆశీర్వాద సభ' సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ ముఖ్య సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ మిగతా 2లో..



DD9 వార్త
తెలుగు దినపత్రిక

DD9 Vaartha

గురువారం
25-06-2026
హైదరాబాద్

## హైదరాబాద్ వాసులకు తాగునీటి ముప్పు..!

**మొదటిపేజీ తరువాయి**

రోజుల్లో తాగునీటి సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**జూలై నెలాఖరు వరకే నీటి సరఫరాకు ఛాన్స్**

సింగూరు ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందులో కేవలం 5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రస్తుతమున్న నీటి పరిమాణాన్ని బట్టి చూస్తే, కేవలం రాబోయే జూలై నెలాఖరు వరకు మాత్రమే ఇక్కడి నుండి నీటిని సరఫరా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ లోగా వర్షాలు పడకపోతే తాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

**అధికారుల అప్రమత్తత..**
**'ఎమర్జెన్సీ పంపింగ్'కు ఏర్పాట్లు**

ప్రాజెక్టులో నీటి మట్టం అడుగున పడిపోవడంతో సాధారణ పద్ధతిలో ఇన్‌టేక్ వెల్ ద్వారా నీరు అందడం లేదు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు హైదరాబాద్ జలమండలి (HMWSSB) అధికారులు అప్రమత్తమయ్యారు. నగర ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ఉండేందుకు 'ఎమర్జెన్సీ పంపింగ్' ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా నీటిని పైకి పంపింగ్ చేయడానికి అత్యవసరంగా 17 భారీ మోటార్లను సిద్ధం చేశారు.

**నత్తనడకన సాగుతున్న రూ. 16 కోట్ల రివిట్మెంట్ పనులు**

ఇదిలా ఉండగా, గతంలో అందిన డ్యామ్ సేఫ్టీ (ఆనకట్ట భద్రత) నివేదిక ఆధారంగా సింగూరు ప్రాజెక్టు వద్ద రూ. 16 కోట్ల వ్యయంతో రివిట్మెంట్ పనులను ప్రభుత్వం చేపట్టింది. అయితే, ఈ పనుల పురోగతి నెమ్మదిగా సాగుతుండటంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. నత్తనడకన సాగుతున్న ఈ నిర్మాణ పనులు ప్రస్తుత వర్షాకాలం ముగిసే నాటికి పూర్తవుతాయా లేదా అనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**యుద్ధ ప్రాతిపదికన చర్యలు**

సింగూరు ప్రాజెక్టు కేవలం హైదరాబాద్‌కే కాకుండా మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సైతం 'మిషన్ భగీరథ' పథకం ద్వారా తాగునీటిని అందిస్తోంది. నీటి నిల్వలు తగ్గినప్పటికీ, ఈ జిల్లాల పరిధిలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు జలమండలి , మిషన్ భగీరథ అధికారులు సంయుక్తంగా యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు.

## ముంబైని ముంచెత్తిన వాన

**మొదటిపేజీ తరువాయి**

కొండచరియలు జారిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావడానికి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభావిత ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలను తాత్కాలికంగా మూసివేయాలని స్థానిక యంత్రాంగం నిర్ణయించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు అనవసరంగా బయటకు రావొద్దని సూచించింది.

ముంబయి నగరంలోని పలు ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించింది.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అంధేరి ప్రాంతంలోని ప్రముఖ సబ్‌వే పూర్తిగా నీటమునిగింది. నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ముందస్తు జాగ్రత్తగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలను బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) నిలిపివేసింది. ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని వాహనదారులకు సూచించింది.

భారీ వర్షాల ప్రభావం విమాన రాకపోకలపై కూడా కనిపిస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమానాల తాజా సమయాలను సంబంధిత ఎయిర్‌లైన్స్ లేదా విమానాశ్రయ అధికారిక వెబ్‌సైట్లలో పరిశీలించాలని అధికారులు సూచించారు. ఇక ముంబయి నగరంలో పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో మున్సిపల్ సిబ్బంది నీటి తొలగింపు చర్యలను వేగవంతం చేశారు. అత్యవసర సేవల బృందాలను అప్రమత్తంగా ఉంచారు. వర్షాల తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగవచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## హైడ్రా ఉక్కుపాదం.. కాపాడిన రూ.వెయ్యి కోట్ల భూమి

**మొదటిపేజీ తరువాయి**

ఖానామెట్ గ్రామంలోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చింది. ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.1,000 కోట్ల వరకు ఉంటుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ భూమిపై కొందరు వ్యక్తులు హక్కులు కలిగినట్లుగా వ్యవహరిస్తున్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది. భూమిని చుట్టుముట్టేలా రేకుల షీట్లతో ప్రహరీ నిర్మించడంతో పాటు రెండు తాత్కాలిక షెడ్లు, ఒక గదిని కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు.

ఈ భూమిని తమదిగా చెబుతూ ఇతరులను అటువైపు రానీయకుండా అడ్డుకుంటున్నారని రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.

పరిశీలన అనంతరం అక్రమ నిర్మాణాలుగా గుర్తించిన షెడ్లు, గది, ప్రహరీ నిర్మాణాలను తొలగించారు. ఆక్రమణలన్నింటినీ పూర్తిగా తొలగించిన తర్వాత భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ బలమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణ ప్రయత్నాలు జరగకుండా జాగ్రత్త చర్యగా హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఐటీ కారిడార్‌లో భూముల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలపై అక్రమ కన్నేసే ప్రయత్నాలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాంటి ప్రయత్నాలను ఎప్పటికప్పుడు గుర్తించి అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ఖానామెట్‌లోని ఈ భూమిని కాపాడడం ద్వారా భారీ విలువైన ప్రజా ఆస్తిని రక్షించినట్లయిందని పేర్కొన్నారు.



# రేవంత్ ఢిల్లీ చుట్టూ తిరిగితే లాభమేంటి?

**మొదటిపేజీ తరువాయి**

వేయలేకపోతోందని ఆరోపించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని కేసీఆర్ గతంలోనే హెచ్చరించారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు చూస్తే ఆ వ్యాఖ్యలు నిజమయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడం వల్ల తెలంగాణ నష్టపోయిందని, అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీకి వెళ్తున్నారని ప్రస్తావించిన కేటీఆర్, ఆ పర్యటనల వల్ల రాష్ట్రానికి వచ్చిన ప్రయోజనాలు ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి తెలంగాణకు అదనపు నిధులు, కీలక ప్రాజెక్టులు లేదా ప్రత్యేక హామీలు సాధించారా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలోని రైతాంగం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు వంటి పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి భరోసా కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగ యువత పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఉద్యోగాల భర్తీ విషయంలో స్పష్టత లేక యువతలో నిరాశ పెరుగుతోందని అన్నారు. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు చూపలేకపోయిందని ఆరోపించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు, జర్నలిస్టులు సహా ఏ వర్గాన్ని తీసుకున్నా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. సత్తుపల్లి ప్రాంత జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల అంశాన్ని కూడా కేటీఆర్ ప్రస్తావించారు. స్థానిక విలేకరులకు తగిన గుర్తింపు ఇవ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. మీడియా ప్రతినిధుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించాలని సూచించారు.



ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, కొన్ని చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో బీఆర్ఎస్ విజయావకాశాలు కోల్పోయిందన్నారు. అయితే అలాంటి ఫలితాల వల్ల పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురికావాల్సిన అవసరం లేదని చెప్పారు. గెలుపు వచ్చినా అతిశయించవద్దని, ఓటమి ఎదురైనా ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలో వేసిన పునాదులే కారణమని చెప్పారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం మళ్లీ రావాలనే ఆకాంక్ష ప్రజల్లో కనిపిస్తోందని, ఆ దిశగా బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

**మొదటిపేజీ తరువాయి**

విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.

ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు.



రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

## తుంగభద్ర జలాలపై కుట్రలు ఆపాలి

**మొదటిపేజీ తరువాయి**

గుర్తుచేశారు. ముఖ్యంగా పాలమూరు ప్రాంతంలో సాగునీటి పరిస్థితిని మెరుగుపరిచేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి జలాల అంశంలో ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు తుంగభద్ర జలాల విషయంలో కూడా అదే వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడి రైతుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే నిర్ణయాలకు ఎలా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్‌వోసీ పొందేందుకు తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారనే అనుమానాలు వ్యక్తం చేశారు.

తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కలపర్వి, చిక్కలమంచి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏడాదికి పైగా కాలంగా ఈ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక కారణం ఏమిటని నిలదీశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)కు ఎగువన నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు రావాల్సిన నీటి ప్రవాహాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని, కొత్త ప్రాజెక్టులు పూర్తయితే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరించారు. కర్ణాటక చేపడుతున్న నిర్మాణాలకు కేంద్ర జల సంఘం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, సంబంధిత రాష్ట్రాల అనుమతులు అవసరమని పేర్కొన్న హరీశ్‌రావు, అలాంటి అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించామని, చివరి ఆయకట్టుకు నీరు అందించే ప్రయత్నాలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు.

కర్ణాటక ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఒకటి రెండు ప్రాజెక్టులకే పరిమితం కాదని, తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలపై కూడా ప్రభావం పడుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీని ప్రభావం పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలపైనా పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటక చేపడుతున్న ప్రాజెక్టులపై కేంద్ర జల సంఘం, కేఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి శాఖకు అధికారికంగా అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కోరారు. తెలంగాణ జల హక్కులను ఏ పరిస్థితుల్లోనూ బేరసారాల అంశంగా మార్చకూడదని స్పష్టం చేసిన హరీశ్‌రావు, పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి చుక్క కోసం తమ పార్టీ ఎంత దూరమైనా వెళ్లి పోరాడుతుందని హెచ్చరించారు.



## కేసీఆర్ అప్పులు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలు అమలు

**మొదటిపేజీ తరువాయి**

పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం , కేసీఆర్ కుటుంబంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**జూన్ 30న సీఎం రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'**

మధిర నియోజకవర్గం, చింతకాని మండలం జగన్నాథపురంలో జూన్ 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భారీ బహిరంగ సభ జరగనుందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ 'రైతు ఆశీర్వాద సభ'ను నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు , రైతాంగం పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు.. కాళేశ్వరం కృంగిపోయింది!**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను తీవ్ర అప్పుల రాష్ట్రంగా మార్చారని డిప్యూటీ సీఎం మండిపడ్డారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ ఎంతో బలంగా, చెక్కుచెదరకుండా ఉంటే, కేసీఆర్ ప్రభుత్వం రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం పదేళ్లలోనే కృంగిపోయిందని విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలతో సహా చెల్లిస్తోందని, ఇప్పటివరకు కేసీఆర్ చేసిన అప్పుల కోసం రూ. 76 వేల కోట్ల రూపాయలను చెల్లించామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని, ప్రజలెవరూ వారి మాటలను నమ్మవద్దని కోరారు.

ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసమే పనిచేస్తుందని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తాము ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు, నిరుపేదల కోసం రూ. 22 వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం ఇప్పటికే రూ. 13 వేల కోట్లు చెల్లించామని వివరించారు. అలాగే రైతు రుణమాఫీ, రైతు భరోసా కింద కూడా వేల కోట్ల రూపాయలను రైతులకు అందజేశామని ఆయన వెల్లడించారు.

**ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన కొన్ని నూతన ప్రోగ్రామ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటు హక్కు ఎంతో విలువైనదని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు (BLAs) ప్రజల వద్దకు వెళ్లి ఓటు హక్కుపై సమగ్రమైన అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి కూడా ఓటర్లకు సంబంధించిన పూర్తి, సమగ్రమైన సమాచారాన్ని అందించాలని, జూన్ 30న జరిగే రైతు ఆశీర్వాద సభను అందరూ కలిసి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## గురుకుల విద్యలో రేవంత్ సర్కార్ సంచలనం

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) మూడవ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి భేటీ జరిగింది. 2017 తర్వాత దాదాపు తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఈ బోర్డు సమావేశం జరగడం, ఇందులో విద్యార్థులు, అధ్యాపకుల సంక్షేమమే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం.

సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల పిల్లలకు నాణ్యమైన చదువులను అందించడం ద్వారానే నిజమైన సామాజిక సాధికారత సాధ్యమవుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేవలం సాధారణ చదువులకే పరిమితం కాకుండా, గురుకుల విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, అధునాతన డిజిటల్ విద్యా విధానాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

గురుకుల డిగ్రీ కళాశాలల విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు, అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులకు (లెక్చరర్లకు) యూజీసీ వేతన స్కేలును అమలు చేసేందుకు బోర్డు సానుకూల నిర్ణయం తీసుకుంది. డిగ్రీ కళాశాలల పర్యవేక్షణ, సజావుగా నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక పరిపాలనా విభాగాన్ని (అడ్మినిస్ట్రేటివ్ వింగ్) ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ఈ కళాశాలలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 'న్యాక్' గుర్తింపు సాధించేలా ప్రణాళికలు రూపొందించడానికి ఒక ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానించారు.

మారుతున్న సాంకేతిక కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సరికొత్త విద్యా విధానాన్ని తెస్తోంది. ఇందులో భాగంగా గురుకుల డిగ్రీ కళాశాలల్లో రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) వంటి అధునాతన కోర్సులను ప్రవేశపెట్టాలని బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దీనితో పాటు, హైదరాబాద్ నగరంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ ఆధ్వర్యంలో ఒక నూతన ఫార్మసీ కళాశాల (ఫార్మసీ కాలేజ్) స్థాపనకు ఈ సమావేశంలో సూత్రప్రాయంగా ఆమోదం లభించింది.

ఉన్నత చదువుల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఐఐఎంలు లేదా విదేశీ విశ్వవిద్యాలయాలకు ఎంపికయ్యే ప్రతిభావంతులైన ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలవనుంది. వారికి డిజిటల్ చదువుల కోసం ఉచితంగా అధునాతన ల్యాప్‌టాప్‌లతో పాటు, అవసరమైన ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందించే ప్రతిపాదనకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, గురుకులాల్లో పనిచేస్తున్న క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్లను ఇకపై టీజీటీలు గా గుర్తిస్తూ, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల పారితోషికాలను పెంచేందుకు అంగీకారం తెలిపారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో సీట్లు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షణను మరింత బలోపేతం చేస్తోంది. విద్యార్థులను 9వ తరగతి నుంచే నీట్ , జేఈఈ వంటి కఠినమైన జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు రాష్ట్రంలో కొత్తగా మరో 9 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది.





# డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్23(డీడీ9 వార్త):**





మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక శాపమని, వీటి నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా జూన్ 22 నుంచి 26 వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బోధన్‌లోని ఇందూరు మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ...డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. "సే నో టు డ్రగ్స్ సే ఎస్ టు లైఫ్" అని నినదించిన ఆయన, ఎవరైనా మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగం గురించి తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా యువత సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 'యాంటీ డ్రగ్ సోల్జర్' సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రాయింగ్ మరియు వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన సాత్విక, శ్రీనిధి, శ్రీజల్, పాటిల్ శృతి, అక్షర, కోయల్ శ్రీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీవితాలను చిదిమేసే డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు: ఎస్సై రాజ శేఖర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్23(డీడీ9 వార్త):**

నేటి విద్యార్థులే రేపటి సమాజానికి వెన్నెముక అని, వారి భవిష్యత్తును ఛిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లకూడదని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బోధన్ మండలం కల్దుర్కి గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సరదాగా మొదలయ్యే మత్తు పదార్థాల అలవాటు చివరకు ప్రాణాలకే ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలైతే శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకునే వయసులో లక్ష్యసాధనపైనే దృష్టి సారించాలని అనైతిక మార్గాలను ఎంచుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు.

ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు - యువత భవిష్యత్తుపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. వీటిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. సమాజంలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇటువంటి సమాచారం ఇచ్చేవారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. నేరాల్లో భాగస్వాములైన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు దెబ్బతినడమే కాకుండా, విదేశీ ప్రయాణాలకు సైతం ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు



## రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందించడంలో జాప్యం.

- **ఆందోళనలో విద్యార్థులు తల్లిదండ్రులు.**
- **జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.**
- **ఈదునూరి నర్సింగ్**
- **టీఆర్ఎస్ డి పార్టీ రాష్ట్ర ఉపాధ్యలు.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 25:**



విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో..విద్యార్థిని విద్యార్థులకు రామగుండం రెవిన్యూ కార్యాలయం నుండి కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు అందించడంలో గత 15 రోజులనుండి రామగుండం తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా విఫలం చెందారు.కార్యాలయంలో ఆపరేటర్ అందుబాటులో ఉండక పోవడంతో.. విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్‌లు సకాలంలో అందక పోవడం తో విద్యార్థుల ఉన్నత చదువులకై భవిష్యత్ ప్రశ్నర్ధకరంగా.. మారింది.ఎంసెట్ కు క్వాలిఫై అయినా విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో చదవాలనుకునే వారికి కులం,ఆదాయం నివాసం ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా ఉండాలి ఎంసెట్ కౌన్సెలింగ్ కోసం రోజు వారీగా స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ఎంసెట్ కౌన్సెలింగ్ లో అధికారులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి వున్నది. ఎంసెట్ కౌన్సెలింగ్ గోదావరిఖని లో మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారు.కావున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గారు. మరియు ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలని తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ పక్షాన కోరుతున్నాను.

## అమ్దాపూర్‌లో అభివృద్ధి పనుల జోరు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్23(డీడీ9 వార్త):**

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామం జగ్గజనని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, ఉప సర్పంచ్ రుమ్మాజీ మరియు వార్డు సభ్యుల కృషితో కాలనీలో డ్రైనేజీ నిర్మాణం, మొర్రం పోయడం, కల్వర్టు పనులను పూర్తి చేశారు. అనంతరం రోడ్డు రోలర్‌తో రోడ్డును చదును చేయించి కాలనీవాసుల ప్రయాణ ఇబ్బందులను తొలగించారు. కాలనీ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సమీరుద్దీన్, కునింటి రాజు, ఈశ్వర్, భూమయ్యలతో పాటు డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెన్న తదితరులు పాల్గొన్నారు. .



## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి.

- **మాదకద్రవ్యాల అవగాహణ సదస్సులో ఎస్సై మాచినేని రవి**

**బోనకల్,జూన్ 24(డీడీ9 వార్త):**

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలనీ ఎస్సై మాచినేని రవి తెలిపారు, బుధవారం మాదకద్రవ్యాలపై మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది,ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడుతు మాదకద్రవ్యాలు యువత బంగారు భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తాయనీ అన్నారు. యువతకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు చట్టపరమైన ఇబ్బందుల గురించి తెలియజేశారు.డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా బాధ్యత గల పౌరులుగా పోలీసులకు తెలుపాలన్నారు.






## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు భూమిపూజ నిర్వహించిన సర్పంచ్ ధర్మతేజ్

**బీర్కూర్, జూన్ 24(డిడి9 వార్త):**

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ధర్మతేజ్ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధితో పాటు మహనీయుల సేవలను గుర్తు చేసుకుంటూ వారి స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పరమేష్ పంతులు, ఏఎంసీ వైస్ చైర్మన్ యమరాములు,వాడ్ మెంబర్లు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

## ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదంలో యువకుడు మృతి

**బీర్కూర్, జూన్ 24(డిడి9 వార్త):**



బీర్కూర్ మండల పరిధిలోని పోచారం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో పోచారం కాలనీకి చెందిన షేక్ సల్లు అలియాస్ సల్మాన్ మృతి చెందాడు.వాటర్ ట్యాంక్ గల్లీలో ఓ ఇంటి వద్ద నిలబడి ఉండగా, అటుగా వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వెనక్కి చూసుకోకుండా వాహనాన్ని నడిపినట్లు సమాచారం.ఈ క్రమంలో ట్రాలీ టైరు గుంతలో దిగిపోవడంతో ట్రాలీ వెనుక భాగం ఒకవైపు ఒరిగి షేక్ సల్లు పై పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బీర్కూర్ ఎస్ఐ వి.కె రాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## పోలియో నివారణకు రెడ్ క్రాస్ చేయూత

- **1,100 మార్కర్ పెన్నుల అందజేత**

**నిజామాబాద్ జిల్లా జూన్23(డీడీ9 వార్త):**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ పోలియో దినోత్సవ కార్యక్రమం కోసం రెడ్ క్రాస్ సొసైటీ తనవంతు సహకారాన్ని అందించింది. పోలియో చుక్కలు వేసిన చిన్నారులను గుర్తించేందుకు అవసరమైన 1,100 మార్కర్ పెన్నులను జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రాజశ్రీకి రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగానే ఈ పెన్నులను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుమంత్ కుమార్, రాష్ట్ర ఎంసీ కమిటీ సభ్యులు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కలిపి రవీందర్, మోపాల్ మండల చైర్మన్ ఘనపూర్ వెంకటేశ్వర్లు, డిపిఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డిఎంహెచ్‌వో సమీక్ష

- **పోలియో చుక్కల పంపిణీకి పక్కా ప్రణాళిక**

**నిజామాబాద్ జిల్లా జూన్23(డీడీ9 వార్త):**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో డిఎంహెచ్‌వో డాక్టర్ బి. రాజశ్రీ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆమె స్పష్టం చేశారు. మొదటి రోజు బూతుల వద్ద 90 శాతం కంటే ఎక్కువ లక్ష్యాన్ని చేరుకోవాలని, 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇటుక బట్టీలు, నిర్మాణ రంగ ప్రాంతాలు, తాండాలు, మారుమూల గ్రామాల్లో ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చూడాలని సూచించారు. క్షయ రహిత గ్రామాల స్ఫూర్తితో పట్టణాల్లోనూ క్షయ రహిత వార్డుల కోసం లక్షిత వ్యక్తులకు పరీక్షలు నిర్వహించాలని, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పోషకాహార కిట్లను పంపిణీ చేయాలని కోరారు. జిల్లాలో నమోదైన 932 క్యాన్సర్ కేసులను స్థానిక వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షించి పర్యవేక్షించాలని ఆదేశించారు. 30 ఏళ్లు పైబడిన జనాభాలో మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయాలని, అలాగే ప్రమాదకర లక్షణాలున్న గర్భిణులను ముందుగానే గుర్తించి సుఖ ప్రసవానికి ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. హెచ్ఎంఐఎస్, ఎంసీహెచ్, ఎన్‌సీడీ, యువిన్, ఆమ్ పోర్టల్స్ నమోదుతో పాటు ఆబాస్ అటెండెన్స్ 100 శాతం పూర్తి చేయాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో రోజుకు కనీసం 60 ఓపీలు ఉండాలని డిఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిటిసిఓ డాక్టర్ బేబీ నాగేశ్వరి, ఏఓ సుమంత్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సికందర్ నాయక్, వివిధ విభాగాల ప్రోగ్రామ్ అధికారులు, వైద్య నిపుణులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం,స్కూల్ యూనిఫాములు పంపిణీ చేసిన సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్.

- **స్కూల్ పిల్లలకు యూనిఫామ్స్ పంపిణీ చేసిన- రాజన్న సేవాసమితి చైర్మన్ మనాలి టాగూర్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 25:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామం మోడల్ అంగన్వాడి కేంద్రంలో1లో సిడిపిఓ అలేఖ్య పటేల్ఆదేశానుసారం ప్రీ స్కూల్ పిల్లలకు అక్షరాభ్యం, స్కూలు యూనిఫామ్స్ గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ అధ్యక్షతన అంగన్వాడి కేంద్రంలో 15 మంది ప్రీస్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం స్కూల్ యూనిఫామ్స్ ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ యూనిఫామ్స్ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ నూతనంగా అంగన్వాడి టీచర్ పెండ్యాల విమల, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సునీత, పదవి విరమణ, నూతనంగా బాధ్యతలు పొందిన సందర్భంగా వారిని రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, సర్పంచులు మగ్గిడి స్వరూప శ్రీనివాస్, ఆంగోత్ రవికుమార్ నాయక్, కొలిపాక చంద్రారెడ్డి,మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి డిసిసి ప్రధాన కార్యదర్శి పూదారి సత్తయ్య గౌడ్, శాలువలతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలోని ప్రీ స్కూల్ పిల్లలకు గత కొద్ది సంవత్సరాలుగా అంగన్వాడి అంటేనే అమ్మబడి అనే విధంగా తీర్చిదిద్దిన టీచర్ పెండ్యాల విమల పదవి విరమణ పొందడం చాలా బాధాకరమని అయినప్పటికీ పదవి విరమణ అనేది ప్రతి ఒక్కరికి తప్పదని,ఈ అంగన్వాడి కేంద్రం మళ్లీ యధావిధిగా మంచి పేరు తోటి నడవాలంటే ప్రస్తుతం వచ్చినటువంటి టీచర్ సునీత పిల్లలకు మంచి విద్యను అందించి, క్రమ పద్ధతిలో ఉంచి తీర్చిదిద్దాలని టీచర్ సునీతకు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ ప్రీ స్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం నేర్పించి, స్కూల్ యూనిఫార్మ్స్ అందించడం జరిగింది.అనంతరం గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప, పెండ్యాల విమల రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, వివిధ గ్రామాల సర్పంచులను శాలువాలతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్, రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, నూతనంగా అంగన్వాడి టీచర్ సునీత, పదవి విరమణ పొందిన టీచర్ పెండ్యాల విమల, పంచాయతీ కార్యదర్శి ఎస్ కమల, ఆశా వర్కర్ జ్యోతి, ప్రీ స్కూల్ కమిటీ సభ్యులు లాస్య, రవళి, భాగ్య, స్రవంతి, పద్మ, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



## మేడారం జాతరకు పట్టిన రోడ్డు కాంట్రాక్టర్స్ పనితీరు

- **రోడ్డు కాంట్రాక్టు చేతులు దులుపుకున్న కాంట్రాక్టు**
- **కొన్ని కోట్ల డబ్బు వృధా నీటిపాలు?**
- **మేడారం జాతర మెయిన్ రోడ్ల పనుల్లో కండ్లు మూసుకున్న అధికారులు**
- **ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం**
- **(జంపంగవాయి కొత్తూరు ఊరట్టం కాలనీలో )వన్ సైడ్ రోడ్డు రోడ్ల పరిస్థితి**

**తాడ్వాయి మండలం జూన్ 24 (డిడి 9వార్త)**

ప్రపంచంలోనే అతిపెద్ద జాతర మేడారం రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది రోడ్డు ఒకే దెబ్బతో వన్ సైడ్ నీటి కోత వల్ల (జంపంగ వాయి కొత్తూరు ఊరట్టం కాలనీలో) రోడ్ వన్ సైడ్ నుండి కొట్టుకుపోయిన రాళ్లు అదే రోడ్డు మీద కంకర రాళ్లు ఉండటం వల్ల కిడ్ అయ్యి వచ్చి పోయే టూ వీలర్స్ కిందపడి ముఖము కాళ్లు చేతులు దెబ్బలు శరీరంపై బాగా తగిలాయి వచ్చే పోయే భక్తులకు కూడా గాయాలు అయినాయి ప్రతి వర్షానికి ప్రతి సంవత్సరానికి ఇదే పరిస్థితి జరుగుతుంది రోడ్డు నాణ్యత లోపం బాగా జరుగుతుంది పల్లె గ్రామాల పరిస్థితి ఇలా ఉంటుంది ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనులు ఒక వర్షానికి దెబ్బతినడం బాధాకరమని ప్రజలు వ్యక్తపరిచారు ఈ రోడ్డుపై విచారణ జరిపి కాంట్రాక్టర్స్ పై చర్యలు తీసుకోవాలని ఆవేదనతో అగ్రహంతో స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు





## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి.

- **యువతకు దిశ నిర్దేశం చేసిన గోదావరిఖని ఏసీపీ మడత రమేష్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 25:**

జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా,జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈరోజు మంథని రిషిత ఫంక్షన్ హాల్లో మంథని సీఐ బుద్దె స్వామి,ఎస్సై మల్లయ్య ఆధ్వర్యంలో కాకతీయ హైస్కూల్, అలోక్ హైస్కూల్, మేరీ మెట్రిక్యులేషన్ స్కూల్,తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ గురుకులం విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, గతంలో గంజాయి వంటి మత్తు పదార్థాల గురించి చాలా మందికి అవగాహన కూడా ఉండేది కాదని, ముఖ్యంగా 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల తల్లిదండ్రులను, పెద్దలను అడిగితే వారి జీవితంలో గంజాయిని చూసిన సందర్భాలు కూడా చాలా అరుదుగా ఉండేవని అన్నారు. కాలక్రమేణా ఇతర ప్రాంతాల నుంచి ఈ మత్తు పదార్థాలు రాష్ట్రాలకు,జిల్లాలకు, గ్రామాలకు విస్తరించాయని పేర్కొన్నారు.ఒకసారి గ్రామాల్లోకి ప్రవేశించిన తర్వాత అవి కుటుంబాల వరకు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు యువత శారీరక,మానసిక సామర్థ్యాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని,వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.సినిమాలు ,సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోను కాకుండా యువత సానుకూల అంశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే తప్పుడు ఆకర్షణలు, ధూమపానం,మత్తు పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించే సందేశాలకు ప్రభావితమవకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వివిధ వృత్తులు చేస్తున్న యువకుల్లో కూడా ధూమపానం,మద్యం, గంజాయి వంటి అలవాట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సమాజంలో ఇటువంటి చెడు అలవాట్లు క్రమంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఎక్కువగా ఈ మత్తు పదార్థాల బారిన పడే అవకాశం ఉన్నందున వారికి అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినా నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని,వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు,ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు.






## ఆదర్శప్రాయుడు దూలం కుమారస్వామి

- **భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**
- **ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**
- **పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు సుభాకర్ రెడ్డి**

**డీ డీ 9 వార్త, ములుగు :**

పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు బుధవారం మండల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూలం కుమారస్వామి ఉద్యోగ విరమణ సన్మాన ఉత్సవానికి ఎమ్మెల్యే జి ఎస్ ఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు మించి అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో విద్య నాణ్యంగా ఉంటుందన్నారు. రేవంత్ సర్కారు ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడానికి ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. గణపురం మోడల్ పాఠశాలను పబ్లిక్ స్కూల్ గా ఉన్నతికరించడానికి ఎంపికైందన్నారు. గణపురం మండలంలో ఎడ్యుకేషన్ హబ్ గా చేయడంలో భాగంగా గాంధీ నగరంలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గణపురం పాఠశాలలో తాను చదువుకున్నప్పుడు దాదాపు 700 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 100 120 కే పరిమితం కావడంపై విచారణ వ్యక్తం చేశారు. 39 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో దూలం కుమారస్వామి నూటికి నూరుపాళ్ళు సేవలందించారని ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు ఆదర్శపరులయ్యారని ఎమ్మెల్యే జి ఎస్ ఆర్ అభినందించారు. టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కుమారస్వామి విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యా బోధన చేసి ప్రజలచే ప్రశంసలను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు కాయిత జలంధర్ ఆధునిక అధ్యక్షతన వహించగా డీఈవో ఏం రాజేందర్, పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు పి దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆర్ సుధాకర్ రెడ్డి, బి రాజమౌళి, సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, తాసిల్దార్ ఏ రాజేశ్వరరావు, ఎంపీడీవో ఎల్ భాస్కర్, ఎంఈఓ కే కుమార్ యాదవ్ తదితరులు మాట్లాడారు.





## మానవత్వం చాటుకున్న సదాశివనగర్ పోలీసులు.

- **అర్ధరాత్రి దారితప్పిన ఓ తల్లికి సదాశివ నగర్ పోలీసులు గమ్యానికి చేర్చారు.**
- **నైట్ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఇసాక్. రంజిత్ రెడ్డి. మానవత్వం చాటుకున్నారు.**

**3డిడి9వార్త / ధర్మారావుపేట్ 25:**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట్ గ్రామ వీధుల్లో అర్ధరాత్రి చీకటిలో దారి తప్పిన ఓ తల్లికి ఆరాధన డయల్ 100 ద్వారా సదాశివ నగర్ పోలీసులకు చేరింది. వెంటనే స్పందించినవారు. ఆమెను ఆమె గమ్యస్థలానికి చేరువేశారు. మతిస్థిమితం సరిగా లేక సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అయోమయంగా తిరుగుతుందని సమాచారం పోలీసులకు అందింది నైట్ పెట్రోలింగ్ లో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఇసాక్ రంజిత్ రెడ్డి ఒక క్షణం కూడా ఆలస్యం చేయలేదు. ఇది కేవలం ఒక ఫిర్యాదు కాకుండా. ఓ తల్లి ఆపదలో ఉందని గ్రహించినవారు వెంటనే అప్రమత్తమయ్యారు అక్కడికి చేరుకుని గాలించగా. ముఖంపై గాయాలతో. భయంతో వణికిపోతు కనిపించింది ఆ తల్లి. ఆమెను సదాశివ నగర్ గ్రామానికి చెందిన కుర్ర సావిత్రిగా పోలీసులు గుర్తించారు. గాయాలతో ఉన్న ఆ తల్లిని వెంటనే దగ్గరికి తీసుకుని ఓదార్చి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్వయంగా దగ్గరుండి చికిత్స చేయించి ధైర్యం చెప్పారు. బాధ్యత అక్కడితో తీరిపోలేదని భావించిన ఆ పోలీసులు. సావిత్రి బంధువుల కోసం ఆరా తీశారు. ఎట్టికేలకు వారిని సంప్రదించి. పూర్తి వివరాలు చెప్పి. ఆమెను సురక్షితంగా వారి చెంతకు చేర్చారు. అర్ధరాత్రి వేళ. గాయాలతో. మాట సాయం చేసే దిక్కులేక ఒంటరిగా మిగిలిన ఆ వృద్ధురాలికి పోలీసులే కొడుకులై నిలిచారు.



## దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ మరియు ఆలయ గాలిగోపుర ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు.



**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 25:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శ్రీ. భవాని శంకర మడ్ల రామలింగేశ్వర స్వామి ఆలయంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టాపన మరియు ఆలయ గాలిగోపురం ప్రారంభోత్సవం సందర్భంగా కలుష పూజ హోమ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు మరియు భక్తులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# పల్లెల ప్రగతికి ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రగతి పీట

- **భట్టి విక్రమార్క కృషితో మారుతున్న పల్లెల రూపురేఖలు**
- **రూ.17.48 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు**
- **మౌలిక వసతుల కల్పనే ధ్యేయమన్న భట్టి విక్రమార్క**

**బోనకల్,జూన్ 24(డీడీ9 వార్త):**

మధిర నియోజకవర్గ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనుల జాతరను ప్రారంభించారు. మండలంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి,సుమారు రూ. 17.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు కీలక రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

**రూ. 17.48 కోట్ల నిధుల వరద: శంకుస్థాపనల వివరాలు**

మండలంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా



ప్రారంభమైన పనుల వివరాలు ఇలా ఉన్నాయి:

చిరునోముల వత్సవాయి రహదారి: రూ. 3.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి పనులకు ఉప ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు.

ముష్టికుంట్ల గార్లపాడు రోడ్డు: రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రూ. 5.50 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు.

ముష్టికుంట్ల ఎస్సీ కాలనీ అంతర్గత రోడ్లు: దళితవాడల అభివృద్ధిలో భాగంగా ముష్టికుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 73 లక్షలతో



అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ముష్టికుంట్ల పరిధిలోని బోనకల్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చిరునోముల వరకు రూ. 3.30 కోట్ల అంచనా వ్యయంతో నూతన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు.ముష్టికుంట్ల చొప్పకట్లపాలెం రహదారి: ముష్టికుంట్ల నుంచి నాగులవంచ మీదుగా చొప్పకట్లపాలెం వరకు రూ. 4.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు డిప్యూటీ సీఎం కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చెప్పారు. అందులో భాగంగానే నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం రాకతో బోనకల్ మండలంలో పండుగ వాతావరణం నెలకొంది.

# పాఠశాల పారిశుద్ధ్యం పై సర్పంచ్ ఫోకస్

- **పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా**
- **మంత్రి సీతక్క సహకారంతో పాఠశాల లో సౌకర్యాలు కల్పిస్తా**
- **రామంజపూర్ గ్రామ సర్పంచ్ పెండేలా అశోక్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గుంటూరు పల్లె ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ పెండల అశోక్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు వల్లాల రాజేందర్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు 19 మంది విద్యార్థులు నమోదు కావడంతో ఈ విషయాన్ని సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. మరుగుదొడ్లకు తలుపు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతూ తెలుపడంతోనే గ్రామ పంచాయతీ తీర్మానంలో మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాల ఆవరణ కాంపౌండ్ వాల్ కూలిపోవడంతో మరమ్మతు చేయించాలని కోరగా ఆయన స్పందించి స్థానిక కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి సహకారంతో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం.




- **వ్యాసరచన, చిత్రలేఖన పోటీలతో పోలీసుల అవగాహన సదస్సు**
- **మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**గోవిందరావుపేట, జూన్24(డిడి 9వార్త)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న "డ్రగ్ అవేర్‌నెస్ వీక్-2026"లో భాగంగా పసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రవీందర్ సూచనలతో, సీఐ దయాకర్ పర్యవేక్షణలో, పసర ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు




మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేకంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధికారులు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు 1908 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే స్థానిక పోలీసులకు ఫోన్ లేదా సందేశం ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు వాసుదేవ్ రెడ్డి, అన్నపూర్ణ, చల్వాయి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, యాంటీ డ్రగ్స్ కోఆర్డినేటర్ ఎస్. భవాని, ప్రాజెక్ట్ నగర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల వార్డెన్ ప్రశాంత్, ఏఎన్ఎం ప్రవళిక, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మంత్రులను విమర్శిస్తే సహించేది లేదు

- **తప్పడు ఆరోపణలు సరికాదు**
- **యూత్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీ శ్రవణ్ కుమార్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లాలో ఇసుక దందాలు జరిగాయని అసత్య ప్రచారం చేస్తూ, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి శ్రీమతి సీతక్క ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరనీ యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ శ్రవణ్ కుమార్ అన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి. ములుగు జిల్లా ప్రజల తరఫున గట్టిగా హెచ్చరిస్తున్నామని అబద్ధాల రాజకీయాలకు స్వస్తి చెప్పండి. ప్రజల తీర్పును గౌరవించండి. లేకపోతే ములుగు గడ్డపైనే తగిన గుణపాఠం చెబుతామని ఆయన తెలిపారు.




# బట్టీలగుంపు రాంనగర్ గ్రామాల మధ్య రూ.1.65 కోట్ల రూపాయల బీటీ రోడ్డుకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 24(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,అశ్వాపురం మండలంలోని బట్టీలగుంపు నుండి రాంనగర్ గ్రామాల మధ్య సుమారు రూ.1 కోటి 65 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం నాడు భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.ఈ బీటీ రోడ్డు నిర్మాణంతో బట్టీలగుంపు, రాంనగర్ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు మరియు సాధారణ ప్రజలకు ప్రయాణం మరింత సులభతరం కానుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, తుక్కాని మధుసూదన్ రెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి సర్పంచ్‌లు కలివేటి సరిత, జిమ్మా ఝాన్సీ, ఏనిక ఉషారాణి, కోర్సా కృష్ణ, మచ్చా నరసింహరావు, కుంజా జాను, సబ్కా పిచ్చయ్య, తెల్లం నాగమణి ఉప సర్పంచ్ లు హర్షా నాయక్, శీలం సంజీవ రెడ్డి, ఇర్పా లక్ష్మణ్, కోండ్రు విజయకుమారి మాజీ సర్పంచ్లు బట్ట సత్యనారాయణ, సోడే వెంకటేశ్వర్లు, జిన్నెక నాగయ్య, నాయకులు మాదినేని రాంబాబు, వేములపల్లి రమేష్, లంకమల్ల కొండలరావు, ఆవుల రవి,సామా కృష్ణారెడ్డి, వాసిరెడ్డి రమేష్, చలపాటి బుజ్జిబాబు, సజ్జా రమేష్, కొమరం భాస్కరరావు, కలివేటి సాంబశివరావు, కలివేటి వెంకటేశ్వర్లు, కుంజా శ్రీనివాసరావు, సప్కా చిన వీరయ్య, లోడిగ నరసింహారావు, పోడుతూరి రాంబాబు, వేముల విజయ్,తాటి రాంబాబు,నూకల సంపత్ మరియు ఇతర వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# గుడిసెలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలి

- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, జూన్ 24 (డిడి 9 వార్త):**

జనగామ జిల్లా నెల్లుట్ల గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల జాబితాను సిద్ధం చేసి, ప్రతి అర్హ కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత నిర్మాణాల పురోగతి పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని, రెండో విడత లబ్ధిదారుల ఎంపికలో నిజమైన అర్హులు ఎవరూ మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో గుడిసెలు, పెంకుటిళ్లు, రేకుల షెడ్లలో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి సొంత గృహం కల్పించడమే లక్ష్యమన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలను కూడా పరిగణనలోకి తీసుకుని అర్హుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని కోరారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, డీఈఈ చంద్రశేఖర్, ఏఈ కార్తీక్, తహసీల్దార్ అందాలు, ఆర్ఐ, జీపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ రాజ్, ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వార్డు సభ్యులు గొరిగే సందీప్, వేల్పుల శోభారాణి, బొజ్జం సునీత ప్రభాకర్, నల్ల అజయ్, నల్ల విల్సన్, తాండ్ర భరత్, అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం ఏరియా లో జరిగిన సింగరేణి పరిరక్షణ సదస్సు కు పెద్ద ఎత్తున కారు ర్యాలీతో బయలు దేరిన మణుగూరు టి బి జి కె యస్ నాయకులు..

- **ముఖ్య అతిథిగా పాల్గొని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన హరీష్ రావు.**

**మణుగూరు.జూన్ 24(డి డి 9వార్త)**

కొత్తగూడెం ఏరియా నందు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్ నందు నిర్వహించిన కాంగ్రెస్ హటావో సింగరేణి బచావో సింగరేణి పరిరక్షణ సదస్సు కు మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్ల కాన్వాయ్ తో నాయకులు, కార్మికులు కొత్తగూడెం తరలివెళ్లారు. టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశానిర్దేశం, టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ఇచ్చిన పిలుపు మేరకు మణుగూరు ఏరియా నుంచి టి బి జి కె యస్ నాయకులు, కార్మికులు 25 కార్ల లో నాగెల్లి వేంకటేశ్వర్లు నాయకత్వంలో భారీ ఎత్తున తరలివెళ్లి సదస్సు విజయవంతం లో భాగస్వామ్యం వహించారు. సింగరేణి కార్మికుల పై కాంగ్రెస్ కుట్రలు, తప్పుడు బొగ్గు నిల్వలు, సింగరేణి పై ఆర్థిక భారం మెడికల్ బోర్డు రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ కుట్రలు, కేసీఆర్ పాలనలో ఇచ్చిన డిపెండెంట్ ఉద్యోగాలపై విజిలెన్స్ వేధింపులు, 54 వేల కోట్ల రాష్ట్ర ప్రభుత్వ బొగ్గు బకాయిలు, మారు పేర్లు, విజిలెన్స్ కేసుల పరిష్కారం, గైర్హాజర్ కార్మికుల అక్రమ డిస్మిస్ లు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణల పై సదస్సులో హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తావించినట్టు టి బి జి కె యస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఊకంటి ప్రభాకర రావు, ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలియచేశారు.సంస్థ ప్రగతి కార్మిక సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టి బి జి కె యస్ చేసే పోరాటాలకు కార్మిక వర్గం అండగా నిలవాలని,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఏరియా టి బి జి కె యస్ నాయకులకు శ్రేణులకు కార్మికులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టి బి జి కె యస్ సెంట్రల్ కమిటి, బ్రాంచి కమిటి, ఫిట్ సెక్రటరీ లు, ఫిట్ కమిటి సభ్యులు, గులాబీ శ్రేణులు, ముఖ్య కార్యకర్తలు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సరియం లాలసకి రూ.4 లక్షల LOC అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 24(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపాడు మండలం, గాంధీనగర్ సారపాక గ్రామానికి చెందిన సరియం లాలసకు మంజూరైన రూ.4 లక్షల విలువైన LOC (Letter of Credit) ను ఆమె తల్లి సరియం భవానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈరోజు తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రటరీ పోలమూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.



## అద్వైత్ – అమృత శ్రీ వర్షిణిల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 24(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నాడు నిర్వహించిన శ్రీ రామచంద్రమూర్తి – జయలక్ష్మి దంపతుల కుమారుడు అద్వైత్ మరియు అమృత శ్రీ వర్షిణిల వివాహ వేడుకకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను అభినందించి తమ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో అతిథులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక అవగాహన కల్పించాలి

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రచారం**

**తాడ్వాయి మండలం జూన్ 24 (డిడి 9వార్త)**



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2026 (ఎస్ఐఆర్) పై జిల్లాలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఐఏఎస్ సంబధిత ఆదేశించారు బుధవారం జిల్లా ఎన్నిక అధికారి,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2026 పై విస్తృత అవగాహన కల్పించడంపై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అందిన ఆడియో, వీడియో ప్రచార సామగ్రిని అన్ని కమ్యూనికేషన్ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు ఈ ప్రచారం ద్వారా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అర్హతలేని పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, యుగిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## నేటి నుంచి ఇంటింటి ఎన్నికల సర్వేకు ప్రజలు సహకరించాలి:

- **తహసీల్దార్ సర్వర్**

**కన్నాయిగూడెం, జూన్ 24(డిడి9 వార్త ):**




నేటి నుంచి మండల వ్యాప్తంగా (ప్రత్యేక సమగ్ర పునర్ సేకరణ) ఎన్నికల ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కన్నాయిగూడెం తహసీల్దార్ తెలిపారు. ఈ సర్వే ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.మండల ప్రజలందరూ సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించి, సరైన వివరాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తహసీల్దార్ సర్వర్ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- **లింగంపల్లిలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**

**జనగామ జూన్ 24(డిడి 9వార్త)బ్యూరో**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల సర్వాంగీణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం (నరేగా) నిధుల నుంచి రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామానికి బీటీ, సీసీ రోడ్ల సౌకర్యం కల్పించి రవాణా సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యమని చెప్పారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.



## మంత్రీ సీతక్క కరోనా సమయంలో చేసిన సేవలను స్పూర్తిగా తీసుకొని ఫ్రీవిల్ ఫౌండేషన్ స్థాపన

- **మంత్రీ సీతక్క ఘన స్వాగతం పలికిన గ్రామస్థులు మహిళలు.**
- **ఫ్రీవిల్ ఫౌండేషన్ టీం ఆద్వర్యంలో 30 వృద్ధుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క**

**తాడ్వాయి మండలం జూన్ 24 (డిడి 9వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం , ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో 30 వృద్ధుల కుటుంబాలకు ఒక నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం ఆర్గనైజేషన్ సెక్రటరీ జాలిగపు జంపన్న ఆద్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరై నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణం అని అన్నారు , పేదలకు సహాయం చేయడం దేవుడిచ్చిన వరం అని కొనియాడారు.ఫ్రీవిల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులను , ఆర్గనైజేషన్ సెక్రటరీ జాలిగపు జంపన్నని అభినందించారు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , తాడ్వాయి మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అరెమ్ లచ్చు పటేల్ , స్థానిక ఉపసర్పంచ్ కాక రంజిత్ , మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొంది సరిత , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ , సీనియర్ నాయకులు కడారి లక్ష్మయ్య , నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ , ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ రెడ్డి , మండల నాయకులు మడకం శోభన్ , వార్డ్ మెంబర్ సభ్యులు దేవులపల్లి బద్రమ్మ , చర్ప నాగమణి , కార్యకర్తలు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు








## మేడారంలో వివాహానికి హాజరైనా నూతన వధూ వరులను ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క

**తాడ్వాయి మండలం జూన్ 24 (డిడి 9వార్త)**


ములుగు జిల్లా తాడ్వాయి మండలం , మేడారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాజీ ఉప సర్పంచ్ గడిగ సుధారాణి చొక్కారవు కుమారుడు సునీల్ వివాహానికి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , వార్డ్ మెంబర్ సభ్యులు సిద్ధబోయిన జనార్ధన్ , కృష్ణ , మండల నాయకులు అనుమాండ్ల రాజీ రెడ్డి , ఆలేటి జైపాల్ రెడ్డి , ఎనగందుల బాపు రెడ్డి , సంఘం రాము , సోషల్ మీడియా టీం , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## కే జి బి వి లో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కన్నాయిగూడెం జూన్ 24(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం కేజీబీవీ జూనియర్ కాలేజీలో ఎం.పీ.సీ, బై.పీ.సీ గ్రూపులకు సంబంధించి ఖాళీగా ఉన్న 7 అధ్యాపక పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జె. అశ్విని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బి.ఎడ్ అర్హతలతో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 25 నుంచి 29 వరకు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9121606721 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## కాంగ్రెస్ ఓట్లను తొలగించడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను అడ్డుకోండి

- **సంగారెడ్డి నియోజకవర్గంలోని 282 మంది బి.ఎల్.ఏలు, ఇంచార్జ్ లు, ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేసిన జగ్గారెడ్డి**
- **ఎమర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేసి "సర్" ప్రక్రియపై చర్చించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి (డిడి9 వార్త)**

టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సర్ పై ఎమర్జెన్సీ సమావేశం కాంగ్రెస్ కార్యకర్తలతో బిఎల్ఎలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ....

ఈనెల 25 నుండి జరిగే ఓటర్ల సవరణపై అందరూ అప్రమత్తంగా ఉండాలి.. ఓటర్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మీదే.. రాహుల్ గాంధీ గెలిస్తే దుర్మార్గమైన పాలన ఆగిపోతుంది...మంచి పాలన మొదలవుతుంది. కాంగ్రెస్ ఓట్లను తొలగించడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను అడ్డుకోండి. ఈనెల 25 నుండి జరిగే ఓటర్ల సవరణపై అందరూ అప్రమత్తంగా ఉండాలి.. ఓటర్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మీదే అని జగ్గారెడ్డి అన్నారు. సర్" ప్రక్రియ ముగిసేవరకు 4 సార్లు సమావేశాలు ఏర్పాటు చేసుకుందాం. ప్రతీ మీటింగులోనూ బి.ఎల్. ఏ లు, ఇంచార్జ్ లు, గెలిచిన, ఓడిన సర్పంచ్ లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొనాల్సిందే ఆయన అన్నారు. ఈ సమావేశానికి హాజరైన డిసిసి అధ్యక్షురాలు, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ ప్రీతం, దయాకర్ పాల్గొన్నారు.



## ఝార్ఖండ్ T20 ఫైనల్: స్టేడియం బయట తొక్కిసలాట.. మంత్రి కీలక ప్రకటన



- ఝార్ఖండ్ T20 ఫైనల్ మ్యాచ్ వద్ద తొక్కిసలాట
- ఉచిత ప్రవేశంతో భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు
- కొంతమందికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్న మంత్రి

**డిడి9 వార్త:**


నిరాటంకంగా కొనసాగిన క్రికెట్ మ్యాచ్ జార్ఖండ్ రాజధాని రాంచీలో నిన్న సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక జేఎస్‌సీఏ (JSCA) అంతర్జాతీయ స్టేడియం వెలుపల తొక్కిసలాట వంటి పరిస్థితి నెలకొనడంతో పలువురు గాయపడ్డారు. జార్ఖండ్ టీ20 లీగ్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన సంభవించింది.

మ్యాచ్ వీక్షించేందుకు ఉచిత ప్రవేశం కల్పించడంతో ప్రేక్షకులు ఊహించని రీతిలో భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మందికి పైగా జనం ఒక్కసారిగా స్టేడియం వద్దకు చేరుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొందరు కిందపడిపోవడంతో గాయాలపాలయ్యారు. అయితే, స్టేడియం వెలుపల గందరగోళం నెలకొన్నప్పటికీ, లోపల మ్యాచ్ మాత్రం ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగింది.

ఈ ఘటనపై జార్ఖండ్ ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తక్షణమే స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. సమీప ఆసుపత్రులను అప్రమత్తం చేయడంతో పాటు ఘటనా స్థలానికి అంబులెన్సులను పంపినట్లు పేర్కొన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో సహాయక చర్యల్లో నిమగ్నమైందని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ ఘటనలో సుమారు నలుగురైదుగురికి గాయాలయ్యాయని, వారికి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని రాంచీ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు.

## మెస్సీ పేరు వినగానే ముఖం తిప్పేసిన రొనాల్డో..



- ఉజ్బెకిస్థాన్‌పై పోర్చుగల్‌కు 5-0 విజయం
- రొనాల్డో ఖాతాలో రెండు గోల్స్
- మీడియా సమావేశంలో మెస్సీపై వరుస ప్రశ్నలు
- ఓ ప్రశ్నను వినకుండానే వదిలేసిన రొనాల్డో
- ఘటనకు సంబంధించిన వీడియో వైరల్
- అర్జెంటీనా మ్యాచ్‌పై పరిమితంగానే స్పందన

**డిడి9 వార్త:**

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మరోసారి మెస్సీ‌రొనాల్డో చర్చ తెరపైకి వచ్చింది. అయితే ఈసారి గోల్స్ వల్ల కాదు. మ్యాచ్ తర్వాత మీడియా సమావేశంలో జరిగిన ఓ చిన్న ఘటన వల్ల. మెస్సీ గురించి వరుసగా ప్రశ్నలు రావడంతో పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అసహనం వ్యక్తం చేశాడు. కొన్ని ప్రశ్నలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఉజ్బెకిస్థాన్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ చెలరేగింది. ప్రత్యర్థిపై 50తో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రొనాల్డో రెండు గోల్స్ చేసి జట్టు విజయానికి బాటలు వేశాడు. తొలి మ్యాచ్‌లో గోల్ చేయలేకపోయిన అతడు ఈసారి తన మార్క్ చూపించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడేందుకు వచ్చిన రొనాల్డోను ఎక్కువగా మెస్సీ గురించే ప్రశ్నలు చుట్టుముట్టాయి.

ఓ విలేకరి మెస్సీ ప్రదర్శన గురించి ప్రశ్న అడగడం ప్రారంభించగానే రొనాల్డో వెంటనే మరోవైపు తిరిగాడు. ఆ ప్రశ్నను కొనసాగించనివ్వకుండా మరో రిపోర్టర్‌ను మాట్లాడమన్నాడు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అంతటితో ఆగలేదు. అర్జెంటీనాతో తర్వాతి దశలో మ్యాచ్ జరిగితే ఎలా ఉంటుందన్న ప్రశ్న కూడా రొనాల్డోకు ఎదురైంది. దీనిపై స్పందించిన అతడు, ''ఇప్పుడే అలాంటి విషయాలు చెప్పడం కష్టం. కానీ ఆ మ్యాచ్ జరిగితే అభిమానులకు మంచి వినోదం దొరుకుతుంది'' అని పేర్కొన్నాడు. అయితే మెస్సీ పేరును పదేపదే ప్రస్తావించడంపై మాత్రం ఆసక్తి చూపలేదు.

మరోవైపు ఈ ప్రపంచకప్‌లో మెస్సీ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. రెండు మ్యాచ్‌ల్లోనే ఐదు గోల్స్ సాధించి అర్జెంటీనాను తదుపరి రౌండ్‌కు చేర్చాడు. పోర్చుగల్ మాత్రం ఇంకా నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకోలేదు. దీంతో రొనాల్డో దృష్టంతా ప్రస్తుతం జట్టు ప్రదర్శనపైనే ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్: రెండో స్థానానికి గిల్.. బుమ్రాతో కలిసి కివీస్ పేసర్ టాప్ ర్యాంక్

- వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకిన కెప్టెన్ గిల్
- టెస్ట్ బౌలింగ్‌లో బుమ్రాతో కలిసి అగ్రస్థానంలో నిలిచిన మాట్ హెన్రీ
- టెస్ట్ బ్యాటింగ్‌లో తిరిగి నంబర్ వన్ ర్యాంకును కైవసం చేసుకున్న జో రూట్
- భారత బౌలర్లు అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ ర్యాంకులు మెరుగు

**డిడి9 వార్త:**

ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లగా, టెస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానాన్ని న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీతో పంచుకున్నాడు. మరోవైపు ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జో రూట్ తిరిగి టెస్టుల్లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు.

**గిల్ దూకుడు.. మెరిసిన ఇషాన్**

ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన శుభ్‌మన్ గిల్, మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్‌కు, గిల్‌కు మధ్య కేవలం 24 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం మాత్రమే ఉంది. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత బ్యాటర్ ఇషాన్ కిషన్ ఏకంగా 21 స్థానాలు మెరుగుపరుచుకుని 43వ ర్యాంకుకు చేరుకున్నాడు.

భారత బౌలర్లు కూడా ఈ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శనతో ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకులో నిలిచాడు. యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ 34 స్థానాలు మెరుగుపరుచుకుని 58వ స్థానానికి చేరుకోగా, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 17 స్థానాలు ఎగబాకి 71వ ర్యాంకును దక్కించుకున్నాడు.

**టెస్టుల్లో బుమ్రాకు పోటీ.. హెన్రీ చరిత్ర**

టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్ల ప్రదర్శనతో మ్యాచ్ విన్నర్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ, భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. 2024 నవంబర్ నుంచి బుమ్రా ఈ స్థానంలో ఒంటరిగా కొనసాగుతుండగా, ఇప్పుడు హెన్రీ అతడితో చేరాడు.



ఈ ఘనత సాధించిన మూడో న్యూజిలాండ్ బౌలర్‌గా మాట్ హెన్రీ చరిత్ర సృష్టించాడు. ఇంతకు ముందు 1947లో జాక్ కోవీ, 1984 నుంచి 1990 మధ్యలో రిచర్డ్ హ్యాడ్లీ ఈ ఘనత సాధించారు. హెన్రీ సాధించిన 870 రేటింగ్ పాయింట్లు, కివీస్ తరపున హ్యాడ్లీ (909), కేన్ విలియమ్సన్ (919) తర్వాత అత్యధికం కావడం విశేషం.

ఇక, టెస్ట్ బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కెరీర్‌లో 12వ సారి రూట్ ఈ ఘనత సాధించడం గమనార్హం.

**టీ20ల్లో ఆస్ట్రేలియా, బంగ్లా ఆటగాళ్ల మెరుగుదల**

బంగ్లాదేశ్‌పై సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా తరపున మిచెల్ మార్ష్ నాలుగు స్థానాలు ఎగబాకి బ్యాటర్ల జాబితాలో 9వ స్థానానికి, నాథన్ ఎల్లిస్ బౌలర్ల జాబితాలో 7వ స్థానానికి చేరుకున్నారు. బంగ్లాదేశ్ సిరీస్ కోల్పోయినప్పటికీ, తౌహిద్ హృదయ్ 9 స్థానాలు మెరుగుపరుచుకుని 30వ ర్యాంకుకు, స్పిన్నర్ నసుమ్ అహ్మద్ ఏకంగా 27 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకుకు చేరుకున్నారు.

# సచిన్‌తో వైభవ్ సూర్యవంశీ పోలిక... కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు

- 15 ఏళ్ల వైభవ్ విషయంలో తొందరపడొద్దన్న కపిల్ దేవ్
- సచిన్‌లా ఎక్కువ కాలం ఆడగడలా చూడాలని వ్యాఖ్య
- ఐర్లాండ్ సిరీస్‌కు ఎంపికైన వైభవ్.. అరంగేట్రానికి సిద్ధం
- ఆడితే సచిన్ రికార్డు బద్దలుకొట్టనున్న యువ సంచలనం

**డిడి9 వార్త:**

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల యువ కిశోరం వైభవ్ సూర్యవంశీపై 1983 ప్రపంచకప్ విజేత కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ యువ ప్రతిభావంతుడి విషయంలో అప్పుడే తొందరపడి అంచనాలకు రావడం సరికాదని, అతడి అసలు సామర్థ్యం 20 ఏళ్లు దాటిన తర్వాతే స్పష్టమవుతుందని పేర్కొన్నాడు. ప్రస్తుతానికి వైభవ్‌ను సచిన్ టెండుల్కర్‌తో పోల్చడం సముచితం కాదని అభిప్రాయపడ్డాడు. ఈ యువ ఆటగాడిపై అధిక ఒత్తిడిని పెంచకుండా, సహనంతో వేచి చూడాలని కపిల్ దేవ్ సూచించాడు.

బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ, ఐర్లాండ్‌తో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో గనుక అతడు బరిలోకి దిగితే, భారత జట్టు తరపున అత్యంత పిన్న వయసులో ప్రాతినిధ్యం వహించిన ఆటగాడిగా సచిన్ టెండుల్కర్ పేరిట ఉన్న రికార్డును అధిగమిస్తాడు. ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున, దేశవాళీ క్రికెట్‌లో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో వైభవ్ అందరి దృష్టిని ఆకర్షించాడు.

బుధవారం నాడు కపిల్ దేవ్ మాట్లాడుతూ, "వైభవ్ చాలా చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభను కనబరుస్తున్నాడు. సచిన్ లాగానే చిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్లోకి వైభవ్ అడుగు పెడుతున్నాడు. అయితే, సచిన్



తరహాలో అతను సుదీర్ఘకాలం పాటు రాణించగలడా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. వైభవ్‌కు 2022 ఏళ్ల వయసు వచ్చిన తర్వాతే అతడి సామర్థ్యంపై ఒక అంచనాకు రావాలి" అని పేర్కొన్నాడు. మరోవైపు, సునీల్ గవాస్కర్ వంటి దిగ్గజాలు సైతం వైభవ్ ప్రతిభను ప్రశంసించారు. ఇటీవల ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంక ఏ జట్టుపై కేవలం 11 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసి వైభవ్ రికార్డు సృష్టించిన విషయం విదితమే.

## ఐసీసీ కొత్త గైడ్‌లైన్స్‌పై సచిన్ హర్షం... మహిళా క్రికెట్‌కు భారీ బూస్ట్

- ప్రెగ్నెన్సీ తర్వాత తిరిగి ఆటకు వచ్చేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు
- మాతృత్వం, ప్రొఫెషనల్ కెరీర్‌ను బ్యాలెన్స్ చేసేలా ప్రోత్సాహం
- క్రీడాకారిణుల మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత
- మాతృత్వం కోసం కెరీర్‌ను వదులుకోవద్దన్న ఐసీసీ చైర్మన్ జై షా

**డిడి9 వార్త:**

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రవేశపెట్టిన నూతన మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు రూపొందించిన ఈ నిబంధనలు, మహిళా క్రికెట్‌కు ఒక 'భారీ ఊతం' అని ఆయన అభివర్ణించారు. మాతృత్వం మరియు వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునేందుకు ఈ మార్గదర్శకాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

ఐసీసీ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్‌ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు



ముందు, ఆ సమయంలో మరియు ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెటర్ల కోసం ఒక నిర్దిష్ట కార్యాచరణను (Framework) రూపొందించడం ఇదే తొలిసారి.

మాతృత్వం కారణంగా ఏ క్రీడాకారిణి కూడా తన దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతోనే ఈ మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు ఐసీసీ చైర్మన్ జై షా తెలిపారు. గతంలో చాలామంది క్రీడాకారిణులు కుటుంబ బాధ్యతల నిమిత్తం కెరీర్‌కు మధ్యలోనే వీడ్కోలు పలకాల్సి వచ్చేది. ఈ నూతన విధానం ప్రతిభావంతులైన క్రీడాకారిణులు ఆటలో సుదీర్ఘకాలం కొనసాగేందుకు తోడ్పడుతుందని ఆయన ఆకాంక్షించారు.

## ఐపీఎల్ క్రికెటర్ పై కేసు.. పెళ్లి పేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

- ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌పై యువతి ఫిర్యాదు
- పెళ్లి పేరుతో నమ్మించి సహజీవనం చేశాడని ఆరోపణ
- కర్ణాటకకు చెందిన వైద్య విద్యార్థిని పోలీసులను ఆశ్రయించింది
- ఆరోపణలను ఖండించిన అభిషేక్.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- రిషభ్ పంత్ స్థానంలో జట్టులోకి వచ్చిన యువ వికెట్ కీపర్ పోరెల్

**డిడి9 వార్త:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆడుతున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ చిక్కుల్లో పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సహజీవనం చేశాడంటూ కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని హూగ్లీ జిల్లా మోగ్రా పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు కేసు నమోదైనట్లు ఓ సీనియర్ పోలీస్ అధికారి మంగళవారం తెలిపారు.

పోలీసుల కథనం ప్రకారం, బాధితురాలు తన తల్లితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. గత మూడేళ్లుగా తా



మిద్దరం రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. అయితే, ఏడాదిన్నర క్రితం వారి మధ్య విభేదాలు మొదలయ్యాయని, అప్పట్లో ఈ విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా కేసు నమోదు కాలేదని తెలిసింది. కాగా, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని 23 ఏళ్ల అభిషేక్ పోరెల్ ఖండించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో హూగ్లీ (రూరల్) ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ స్వయంగా మోగ్రా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్థానిక అధికారులతో కేసు వివరాలపై చర్చించారు. ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు ధ్రువీకరించారు. హూగ్లీ జిల్లాలోని చందన్‌నగర్‌కు చెందిన అభిషేక్, ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు తెలిసింది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో రిషభ్ పంత్ స్థానంలో అభిషేక్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి వచ్చాడు. ఆ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడి విఫలమైనా, ఫ్రాంచైజీ అతడిని అట్టిపెట్టుకుంది. గత సీజన్‌లో మాత్రం యువ వికెట్ కీపర్‌గా రాణించి జట్టు నమ్మకాన్ని గెలుచుకున్నాడు.

8 DD9 వార్త తెలుగు దినపత్రిక DD9 Vaartha గురువారం 25-06-2026 హైదరాబాద్

## రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో కొత్త సినిమా!

రామ్ పోతినేని (Rapo) ప్రధాన పాత్రలో నటిస్తూ తొలిసారి మెగా ఫోన్ చేపట్టి తెరకెక్కిస్తున్న చిత్రం '#రాపో23' (వర్కింగ్ టైటిల్). రాపో సినిమాటిక్స్ (Rapo cinematics) బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మాణంలో ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రామ్ కెరీర్లోనే అత్యధికంగా దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించనున్నట్లు తెలుస్తోంది. అత్యున్నత సాంకేతిక విలువలతో, ఓ విభిన్న నేపథ్యంలో తెరకెక్కించనున్న ఈ సినిమా కోసం జాతీయ స్థాయిలో పేరుగాంచిన టెక్నీషియన్లను ఎంపిక చేసుకున్నారు. జాతీయ అవార్డు గ్రహీత అయిన తిరు ఈ సినిమాకు ఛాయాగ్రాహకుడిగా ఉన్నారు. ఈ చిత్రంలో పోరాట ఘట్టాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందట. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ నేతృత్వంలో వాటిని చిత్రీకరించనున్నారు. అనుభవజ్ఞుడైన ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాశ్ ఈ సినిమా కోసం హైదరాబాద్ శివారులో పలు సెట్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఇందులో వీర అనే పాత్రలో రామ్ స్టైలిష్‌గా కనిపించబోతున్నారు. ఆయన పాత్రకు సంబంధించి ఇప్పటికే విడుదల చేసిన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ భారీ చిత్రంలో రామ్ సరసన నటించే నాయికను ఖరారు చేయాల్సి ఉంది. ఆ పాత్ర ఎవరిని వరిస్తుందో చూడాలి.



## నా బాడీ నా హక్కు అంటే వాడి కళ్లు వాడి ఇష్టం..

టాలీవుడ్ సింగర్ సునిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నా బాడీ నా హక్కు అనుకుంటే చూసేవాడు నా కళ్లు నా ఇష్టం అని అంటాడని అన్నారు. శరీరాన్ని చూపించడం అసలు ఫ్రీడమ్ కిందకు రాదని అన్నారు. నీకు నచ్చిన దుస్తులు వేసుకో.. నీకు నచ్చినట్టు నువ్వు ఉండు కానీ అది కరెక్ట్ అని చెప్పొద్దు అంటూ వ్యాఖ్యానించారు. సేఫ్ గా అనిపించినంతవరకు నీకు నచ్చిన దుస్తులు నువ్వు వేసుకోవచ్చని, ఎవరూ వ్యతిరేకించరని అన్నారు. ఎవరి చూపులు నిన్ను తాకనప్పుడు, ఎవరూ నిన్ను చూడటంలేదని అనిపించినప్పుడు నీకు నచ్చిన దుస్తులు వేసుకోవచ్చని చెప్పారు.
సినిమా ఇండస్ట్రీలో నటీమణులు డ్రెస్సింగ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలో సింగర్ సునిత చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. సునిత మాట్లాడిన వీడియో వైరల్ అవ్వడంతో కొందరు సమర్థిస్తుంటే మరికొందరు ఆమె కామెంట్లను వ్యతిరేఖిస్తున్నారు. సునిత చేసిన కామెంట్లు అనసూయ, చిన్మయి లాంటి వాళ్లకు గట్టి సమాధానం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. దీంతో సునిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి.



## తెరుచుకోనున్న డీమాంటీ కాలనీ తలుపులు

అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన 'డిమాంటీ కాలనీ' ఫ్రాంచైజీలో భాగంగా తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ చిత్రం 'డిమాంటీ కాలనీ 3'. కథానాయకుడు అరుళ్‌నితి, ప్రియాభవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం "ఈ ప్రదేశం గురించి ఆలోచిస్తే భయమేస్తుంది, పీడకలలు వస్తాయి. చీకటి కోసం సిద్ధంగా ఉండండి..డిమాంటీ కాలనీ తలుపులు తెరుచుకోబోతున్నాయి' అనే క్యాప్షన్‌తో ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా సామాజిక మాధ్యమాల్లో ప్రకటించింది. సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపింది. అరుళ్ హీరోగా 'డిమాంటీ కాలనీ' సినిమా రెండు భాగాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించాయి.



## ఎదుటివారి కంటే మనమే ఎక్కువ నరకం అనుభవిస్తాం..




బాలీవుడ్ హాట్ బ్యూటీ మౌనీరాయ్ ఇటీవల తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోయిన విషయం తెలిసిందే. మనస్పర్థల కారణంగా నాలుగేళ్లకే భర్తకు విడాకులు ఇచ్చారు. ఆమె స్వలింగ్ సంపర్కురాలంటూ ట్రోల్స్ వచ్చినప్పటికీ వాటిని ఖండిస్తూ.. ఇక ఆ బాధ నుంచి కోలుకుంటూ ఇప్పుడిప్పుడే సినిమా షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మౌనీరాయ్ జీవితంలో ఎదురైన కష్టాల నుండి, బాధల నుండి బయటపడటానికి భక్తి, ఆధ్యాత్మికత తనకు ఎలా ఉపయోగపడ్డాయో వివరించారు. చిన్న వయసులో కూడా ఇతరులను క్షమించడం తనకు కష్టంగా అనిపించేది కాదని, కానీ ఆ తర్వాత మిగిలిపోయే బాధను మర్చిపోవడమే అసలైన సవాలుగా ఉండేదని ఆమె చెప్పారు. ఇప్పుడు తన జీవితంలో జరిగిన విషయాలు, భక్తి మార్గం వల్ల తనకు ఒక విషయం అర్థమైందని.. మనం ఎదుటివారిని మనస్ఫూర్తిగా క్షమిస్తే చాలు, ఆ బాధను పూర్తిగా మర్చిపోయేలా దేవుడే చూసుకుంటాడని మౌనీ రాయ్ తెలిపారు.
మనల్ని బాధపెట్టిన కోపాన్ని మనసులోనే పెట్టుకుంటే.. ఎదుటివారి కంటే మనమే ఎక్కువ నరకం అనుభవిస్తామని, అందుకే దాన్ని వదిలేయడమే మంచిదని ఆమె చెప్పుకొచ్చారు. కొన్నిసార్లు మనల్ని అంతలా బాధపెట్టిన అవతలి వ్యక్తి.. అసలు ఆ విషయాన్ని పట్టించుకోకుండా హ్యాపీగా ముందుకు సాగిపోతుంటారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, క్షమించడం అంటే వాళ్లు చేసిన తప్పులను ఒప్పుకోవడం కాదని మౌనీ స్పష్టం చేశారు. ప్రపంచంలో కొందరు కావాలనే ఇతరులను ఇబ్బంది పెడుతుంటారు అని.. తాను ఆ మనుషులను చెడ్డవాళ్లు అనడం లేదు కానీ, వాళ్లలో ఉండే ఆ చెడు బుద్ధిని మాత్రం కచ్చితంగా తప్పుపడతానని ఆమె అన్నారు. తనకు ప్రతిరోజూ మెడిటేషన్ చేసుకోవడం వల్లే మనశ్శాంతి దొరుకుతోందని తెలిపారు.

## క్రికెట్‌లో ఇది చరిత్రాత్మక ఘట్టం

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) తీసుకువచ్చిన కొత్త 'పోస్ట్ ప్రెగ్నెన్సీ రిటర్న్ టు ప్లే' (ప్రసవానంతరం తిరిగి ఆటలోకి రావడం) మార్గదర్శకాలను బాలీవుడ్ అగ్రకథానాయిక దీపికా పదుకొణె (Deepika Padukone) స్వాగతించారు. క్రీడల్లో మహిళల కోసం తీసుకున్న అత్యంత అద్భుతమైన నిర్ణయమిదని.. ఒక చరిత్రాత్మక ఘట్టమని ప్రశంసించారు. ఐసీసీ ప్రకటించిన ఈ సరికొత్త పాలసీను దీపికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ.. మహిళా క్రికెటర్లకు లభించిన గొప్ప గుర్తింపుగా దీనిని అభివర్ణించారు. వర్కింగ్ అవర్స్ కారణంగా గతేడాదిలో దీపిక భారీ ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అనంతరం పలు ఇంటర్వ్యూల్లో బాలీవుడ్ అగ్రనటీనటులు మాట్లాడుతూ దీపికకు మద్దతు ఇచ్చారు. తల్లి అయిన అనంతరం హీరోయిన్‌లకు కొన్ని వెసులుబాటులు కల్పించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్తగా తల్లి అయిన మహిళా క్రికెటర్ల కోసం ప్రవేశపెట్టిన పాలసీపై రెండోసారి తల్లి కానున్న దీపిక పోస్ట్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది.
మహిళా క్రికెటర్లు ప్రసవానంతరం మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టే ప్రక్రియను సులభతరం చేసేందుకు ఐసీసీ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ప్రసవం తర్వాత క్రికెటర్లకు అవసరమైన వైద్య, మానసిక సంరక్షణతో పాటు వ్యక్తిగత రికవరీ ప్లాన్‌లను అందిస్తారు. తిరిగి ఫిట్‌నెస్ సాధించేలా ట్రైనింగ్ షెడ్యూల్స్ ఉంటాయి. పసిపిల్లలతో కలిసి ప్రయాణించే తల్లుల కోసం ప్రత్యేక వసతులను ఐసీసీ కల్పిస్తుంది. ఇక దీపిక సినిమాల విషయానికి వస్తే, షారుక్-సిద్ధార్థ్ ఆనంద్ కాంబోలో రానున్న 'కింగ్'లో నటిస్తున్నారు. అల్లు అర్జున్‌కు జోడీగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'రాకా'లో సందడి చేయనున్నారు.




## కేవలం డబ్బు సంపాదించాలనే ఇండస్ట్రీకి వచ్చా..



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ (Akshay Kumar) తన 35 ఏళ్ల సినీ కెరీర్‌లో అతిపెద్ద పశ్చాత్తాపాన్ని పంచుకున్నారు. 'వెల్‌కమ్ టు ది జంగిల్' విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "చిత్రపరిశ్రమలో 35 ఏళ్లు కొనసాగడం అంటే చాలా పెద్ద విషయం. ఎంతో మందిలో ఒక్కరికే ఆ అవకాశం వస్తుంది. నేను ఇంకో 40 ఏళ్లు పూర్తి చేసుకోవాలని కోరుకుంటున్నా. డబ్బు సంపాదించడం కోసమే పరిశ్రమకు వచ్చాను. కానీ, ఇప్పుడు మాత్రం నటన నాలో భాగమైపోయింది. చనిపోయే వరకూ నటిస్తూనే ఉండాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు వరుసగా ఒకే జానర్ సినిమాల్లో నటించాను. వెనక్కి తిరిగి చూసుకుంటే విభిన్నంగా ఎంచుకోనందుకు నాపై నాకే కోపం వచ్చింది. యాక్షన్ పాత్రలు మాత్రమే చేస్తానని అందరూ అనుకున్నారు. దీంతో కొత్త కథలపై దృష్టిపెట్టా.. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్ మ్యాన్' లాంటి విభిన్న చిత్రాలు చేశా. కొందరు ఏడాదికి ఒక సినిమా చాలు అంటారు. కానీ నేను ప్రతిరోజూ పనిచేయాలనుకుంటా. ఫలితం ఆశించకుండా ఏడాదికి కనీసం నాలుగు సినిమాలు చేయడం నా బాధ్యతగా భావిస్తున్నా" అని అక్షయ్ స్పష్టం చేశారు.
అక్షయ్ నటించిన 'వెల్‌కమ్ టు ది జంగిల్' జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'భూత్ బంగ్లా' తర్వాత ఈ ఏడాదిలో ఆయన నుంచి వస్తున్న రెండో చిత్రమిది. అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రవీనా టాండన్, దిశా పటానీ తదితరులు నటించారు.

## ప్రతిరోజూ భయంతో గడపాల్సిన పరిస్థితి వచ్చింది..

ప్రస్తుతం సోషల్ మీడియా హవా ఏ రేంజ్‌లో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న విషయం జరిగినా క్షణాల్లో అందరికీ తెలిసిపోతోంది. అయితే ఈ సోషల్ మీడియాను చాలామంది తమ కెరీర్ ఎదుగుదలకు వాడుకుంటున్నారు. కానీ, ఇదే సోషల్ మీడియా కొందరికి పెద్ద శాపంగా మారుతోంది. సెలబ్రిటీలు ఎప్పుడు ఏ చిన్న మాట మాట్లాడినా.. దాని వల్ల ఎలాంటి ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుందోనని షాక్ తగిలినట్లు భయపడిపోతున్నారు. ఒక్కోసారి వారు సాధారణంగా చేసిన వ్యాఖ్యలను కూడా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ భయం వల్ల కొందరు సెలబ్రిటీలు తాము చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్తుంటే.. మరికొందరు విమర్శలు తట్టుకోలేక సోషల్ మీడియాకే దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న సోషల్ మీడియా ట్రోలింగ్ గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బయట ఏ విషయం మాట్లాడాలన్నా తనకు చాలా భయమేస్తోందని రష్మిక ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఏదైనా మాట్లాడితే.. దాన్ని పూర్తిగా మార్చేసి, వేరే విధంగా బయటకు ప్రచారం చేస్తున్నారని తెలిపింది. అసలు తాను అనని విషయాలను కూడా అన్నట్లుగా క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని రష్మిక చెప్పుకొచ్చింది. దీనివల్ల రోజూ ఉదయం లేవగానే.. తన గురించి నెట్‌లో ఎలాంటి తప్పుడు ప్రచారం జరుగుతుందో, ఎలాంటి రూమర్ వస్తుందోనని నిత్యం భయంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమోషనల్ అయ్యారు. సోషల్ మీడియా ద్వారా మనుషులు ఎదగడం చాలా మంచి విషయమే కానీ.. కొందరు మాత్రం దాన్ని ఇతరులను తక్కువ చేయడానికి, తప్పుగా వాడుకోవడానికి ఉపయోగించడం అస్సలు బాగోలేదని రష్మిక స్పష్టం చేశారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502520.